సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం । 10 । జనవరి । 2024



అచేతనంగా చేనేత సంఘాలు

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో కూనారిల్లుతున్నాయి. - 8లో



సమస్యల పరిష్కారానికి..

సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సీతారాములు అన్నారు. - 8లో



ఏకం కావాలి

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఏకం కావాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. - 10లో

న్యూస్‌రీల్

కోర్టు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి క్రైం: యాదగిరిగుట్టలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనం నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు కోరారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయనను మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కోర్టులో కలెక్టర్ హనుమంతు కే. జండగే కలిశారు. ఈ సందర్భంగా కోర్టు భవన నిర్మాణం, పెండింగ్ అంశాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు కలెక్టర్‌తో చర్చించారు. యాదగిరిగుట్టలో నూతనంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయటానికి తాత్కాలికంగా బీసీ సంక్షేమ వసతి గృహాన్ని గుర్తించామని, భవనాన్ని కేటాయించాలని పేర్కొన్నారు. జిల్లా కోర్టు నూతన భవన నిర్మాణానికి రాయగిరిలో ప్రభుత్వం ఇచ్చిన 10 ఎకరాల భూమిలో రాళ్లు, ముళ్ల పొదలను తొలిగించి రెండు మూడు రోజుల్లో సరిహద్దులు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత జిల్లా కోర్టు ఆవరణలో సుందరీకరణకు సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మారుతి దేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటరీకరణ పకడ్బందీగా నిర్వహించాలి




డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భువనగిరి రూరల్ : ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ పకడ్బందీగా, వేగంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మంగళవారం భువనగిరి మండల అభివృద్ధి కార్యాలయంలో నిర్వహిస్తున్న అభయ హస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీని ఆయన పరిశీలించారు. గడువులోగా కంప్యూటరీకరణ పూర్తి కావాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస రావు, తహసీల్దార్ అంజిరెడ్డి, మండల అభివృద్ధి అధికారి నరేందర్ రెడ్డి తదితరులున్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ పరిశీలన

రాజాపేట: మండల పరిషత్ కార్యాలయంలో చేపట్టిన ఆరు గ్యారంటీ హామీల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను మంగళవారం అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ జ్ఞానప్రకాష్ రావు, తహసీల్దార్ దామోదర్, ఎంపీఓ దినకర్ తదితరులున్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆత్మకూరు(ఎం): ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలో 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రెండు పథకాలను ఇప్పటికే అమలు చేశామని, మరో నాలుగు హామీలను వంద రోజుల్లో అమలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. అనంతరం కాల్వపల్లిలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ తండ మంగమ్మ, జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జన్నాయికోడె నగేష్, సర్పంచ్‌లు ఆకుల సరిత, జామ యాదయ్య, ఎంపీటీసీలు యాస కవిత, మర్యాల వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖరరెడ్డి, తహసీల్దార్ జాల కుమారి, సీనియర్ అసిస్టెంట్ పాండు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు ఇవ్వాలి

భువనగిరి: డీడీలు కట్టిన వారికి వెంటనే గొర్రెల యూనిట్లు ఇవ్వాలని రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించి కాలం గడుస్తున్నా ఇప్పటి వరకు వాటి గురించి చర్యలు తీసుకోకపోవడం సరికాదని తెలిపారు. లబ్ధిదారులకు వెంటనే యూనిట్లు ఇవ్వాలని కోరుతూ బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు.

నిరుపయోగంగా 104 వాహనాలు

భువనగిరిటౌన్: గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందించే 104 వాహనాలు నిరుపయోగంగా మారాయి. గత ప్రభుత్వం వీటి నిర్వహణను ఆపివేయడంతో జిల్లాకు కేటాయించిన 8 వాహనాలు కలెక్టరేట్ ఆవరణలో ఉంచారు. అధికారులు వాటి రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పు పట్టి పోతున్నాయి. గతంలో మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని వినియోగానికి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.



కలెక్టరేట్ ఆవరణలో వృథాగా ఉన్న 104 వాహనాలు

పోలీస్.. డ్యాన్స్ అదుర్స్

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని భువనగిరి జోన్ పోలీసుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం రాత్రి భువనగిరి పట్టణ శివారులోని ఏకే ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో డీసీపీ రాజేష్ చంద్రతో పాటు పలువురు పోలీసులు నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

- భువనగిరి



డ్యాన్స్ చేస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

వలంటీర్లు వస్తున్నారు!

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత అధిగమించేందుకు నిర్ణయం
- జిల్లాలో సుమారు 200 మంది వరకు నియమించే అవకాశం
- జూన్ నాటికి నియామక ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్న ప్రభుత్వం
- విద్యా వలంటీర్లలో చిగురిస్తున్న ఆశలు

భువనగిరి: ఉపాధ్యాయుల నియామకం జరిగే వరకు ప్రభుత్వ పాఠశాలల్లో వారి కొరతను అధిగమించేందుకు విద్యా వలంటీర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకువచ్చేలా జూన్ నాటికి నియామక ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో వలంటీర్ల అవసరం ఏ మేరకు ఉందనే దానిపై అంచనా వేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశించింది. 2019–20 విద్యా సంవత్సరంలో చివరిసారిగా వలంటీర్లు సేవలు అందించారు. అనంతరం కరోనాతో రెండేళ్లు పాఠశాలలు మూతబడ్డాయి. ఆ తరువాత గత ప్రభుత్వం వీరి నియామకంపై దృష్టి సాధించలేదు. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని గ్రహించిన ప్రభుత్వం విద్యా వలంటీర్లను నియమించాలని నిర్ణయించింది. దీంతో విద్యా వలంటీర్లలో ఆశలు చిగురిస్తున్నాయి.



అన్ని వసతులున్నా..

ప్రభుత్వం విద్యాభివృద్ధి, అక్షరాస్యత పెంపునకు అనేక కార్యక్రమాలు చేపడుతోంది. పాఠశాలల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పించేందుకు మన ఊరు – మన బడి కార్యక్రమం నిర్వహిస్తోంది. దీని ద్వారా మౌలిక వసతుల కల్పనకు నిధులు వెచ్చిస్తోంది. అయితే ఉపాధ్యాయుల కొరత కారణంగా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఉన్న వారే రోజుకు రెండు నుంచి మూడు అదనపు తరగతులు బోధించాల్సి వస్తోంది.

జిల్లాలో 630 పోస్టులు ఖాళీ..

జిల్లాలో ప్రస్తుతం 712 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 68 ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 163 ప్రాథమికోన్నత, 481 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం 2,830 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం గత సంవత్సరం డీఎస్సీ నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా ఖాళీల వివరాలను కోరింది. ఈమేరకు జిల్లా అధికారులు 630 ఖాళీలు ఉన్నట్లు పేర్కొనగా.. కేవలం 99 పోస్టుల భర్తీకి అవకాశం కల్పించింది. గత సంవత్సరం అభ్యర్థులు దరఖాస్తులు సైతం చేసుకున్నారు. ఇదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం కొత్తగా వచ్చిన ప్రభుత్వం మెగా డీఎస్సీ చేపడుతామని ప్రకటించింది. ప్రస్తుత విద్యా సంవత్సరం మరో నాలుగు నెలల్లో ముగియనుంది. దీంతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేసి ప్రక్రియ పూర్తయ్యే వరకు సమయం పడుతుందని భావించి వచ్చే విద్యా సంవత్సరంలో సమారు 200 మంది విద్యా వలంటీర్ల నియామకం చేపట్టాలని నిర్ణయించింది.

ఉపాధ్యాయుల కొరత తీరనుంది

విద్యా వలంటీర్ల నియామకం చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. వస్తే అవసరమైన చర్యలు చేపడతాం. విద్యా వలంటీర్ల నియామకంతో ఉపాధ్యాయుల కొరత సమస్య తీరే అవకాశం ఉంది.

– నారాయణరెడ్డి, డీఈఓ

డేటా ఎంట్రీని వేగవంతం చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

అడ్డగూడూరు: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ (డేటా ఎంట్రీ) ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతు కె. జెండగే అన్నారు. అడ్డగూడూరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలో మొత్తం 10,489 దరఖాస్తులకు గాను ఇప్పటి వరకు 3,222 ఆన్‌లైన్ చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో టాయిలెట్స్ రూంకు మరమ్మతులు చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, తరగతి గదుల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ ప్రేమలత, మండల వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

వలిగొండ: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని



అడ్డగూడూరులో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

కలెక్టర్ హనుమంతు జెండగే అధికారులకు సూచించారు. వలిగొండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న డేటా ఎంట్రీ నమోదు ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని సూచించారు., దరఖాస్తుల నమోదు అనంతరం వాటిని భద్రపర్చాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ గీతారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ కేదారీశ్వర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు మనోహర్, కర్ణాకర్‌రెడ్డి తదితరులున్నారు.

ముమ్మరంగా దరఖాస్తుల ఆన్‌లైన్

భువనగిరిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు కోసం ఎనిమిది రోజులపాటు గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. వీటిని ఆయా మున్సిపల్, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపట్టారు. డేటా ఎంట్రీని ఈ నెల 17వ తేదీ లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఈ ప్రక్రియను ముమ్మరం చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,64,922 దరఖాస్తులు రాగా.. ఇప్పటివరకు 50శాతం మేర దరఖాస్తులు ఆన్‌లైన్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో విశేష పూజలు కొనసాగాయి. ఆలయానికి క్షేత్రపాలకుడిగా పూజలందుకుంటున్న శ్రీఆంజనేయస్వామికి మంగళవారం అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. హనుమంతుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి, భక్తులకు పంపిణీ చేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా నిర్వహించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు వంటి పూజలు కొనసాగాయి.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని భువనగిరి స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు రెగ్యులర్ ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు లేదా పాలిటెక్నిక్, ఐటీఐ రెండు సంవత్సరాల డిప్లొమా కోర్సుల్లో పాసైన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ వరకు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు శ్రీలక్ష్మీనర్సింహస్వామి డిగ్రీ కళాశాల భువనగిరి సెల్ నంబర్ 90005 90545ను సంప్రదించాలని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆశా కార్యకర్తలు సమర్థవంతంగా పనిచేయాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పరిపూర్ణాచారి

మోటకొండూర్: గ్రామాల్లో ఆశావర్కర్లు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పరిపూర్ణాచారి అన్నారు. మంగళవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆశాలు మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి మధుసూదన్ రెడ్డి, డీపీహెచ్ఎన్ఓ ఎస్తేర్ రాణి, వైద్యాధికారి డాక్టర్ విజయ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిపూర్ణాచారి

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం కావాలి
- ఆలేరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో గొంగిడి సునీత

యాదగిరిగుట్ట రూరల్: ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధైర్య పడొద్దని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ విప్ గొంగిడి సునీత అన్నారు. త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్ నిర్వహించిన ఆలేరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్ని నెరవేర్చే వరకూ ప్రజల పక్షాన పోరాడాలన్నారు. గృహలక్ష్మి పథకం లబ్దిదారులకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందన్నారు. యాదగిరిగుట్టలో ఏర్పాటు చేయబోయే 100 పడకల ఆస్పత్రికి నిధులు మంజూరు కాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే అంటున్నారని, నిధుల మంజూరికి జీఓ కూడా వచ్చిందని పేర్కొన్నారు. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. ఆరు గ్యారంటీల దరఖాస్తుల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. గృహలక్ష్మి పథకం రద్దు చేసే హక్కు సీఎంకి లేదని, ఆయా గ్రామాల నుంచి కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రజా పాలన దరఖాస్తుల్లో సమాచారం లేదని, డిసెంబర్ 9న వేస్తానన్న రైతుబంధు ఇప్పటికీ రైతుల ఖాతాల్లో జమ చేయలేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరికి టికెట్ వచ్చినా గెలుపుకోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్ గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ బీకునాయక్, జెడ్పీటీసీలు తోటకూరి అనురాధ, పల్లా వెంకట్‌రెడ్డి, ఎంపీపీలు పైళ్ల ఇందిర, చిమ్ముల సుధీర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, ఆయా మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి సిద్ధం

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి తెలిపారు. ఆలేరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తానని, ప్రజలకు మరింత సేవ చేసేందుకే తాను భువనగిరి ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న గొంగిడి సునీత, చిత్రంలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి తదితరులు

లబ్ధిదారుల్లో అయోమయం

- భువనగిరిలోని సింగన్నగూడెం వద్ద 444 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం
- గతంలో లక్కీడ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- ఇప్పటివరకు కేటాయించని ఇళ్లు
- ప్రస్తుత ప్రభుత్వం ఇళ్ల పంపిణీలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని లబ్ధిదారుల్లో ఆందోళన

భువనగిరిటౌన్: డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. భువనగిరి పట్టణంలోని సింగన్నగూడెం వద్ద నిర్మించిన 444 ఇళ్లకు గాను 424 మంది లబ్ధిదారులను గత సంవత్సరం మార్చిలో అధికారులు డ్రా పద్ధతిన ఎంపిక చేశారు. మిగిలిన 20 ఇళ్లను రోడ్డు ప్రమాదాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ చిన్నారులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కేటాయించేందుకు రిజర్వ్ చేశారు. డ్రా పద్ధతిలో ఎంపిక చేసిన వారి జాబితా ప్రకటించినప్పటికీ వారికి ఇప్పటివరకు ఇళ్లు కేటాయించలేదు. అయితే ఎంపిక విధానంలో పలు విమర్శలు రావడం, అదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో పంపిణీ ప్రకియ నిలిచిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఇళ్ల పంపిణీపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఎంపికైన లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

424 మంది లబ్ధిదారుల ఎంపిక

డబుల్ బెడ్ రూం ఇళ్లు కొంతమేర ధ్వంసమయ్యాయి. వీటికి మరమ్మతులు చేసి లక్కీ డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు కేటాయించేందుకు రూ.3కోట్లు కావాల్సి వస్తుందని అప్పటి కలెక్టర్ పమేలా సత్పతి అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇప్పటివరకు దానిపై స్పష్టత రాలేదు. ఇళ్లు వినియోగంలో లేకపోవడం, జాతీయ రహదారికి సమీపంగా ఉండటంతో ప్రస్తుతం మందుబాబులు సిట్టింగ్ వేస్తున్నారు. రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది.



సింగన్నగూడెం వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇవ్వడంతో..

ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున సాయమందిస్తామని తెలిపింది. దీంతో పాటు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను నిరుపయోగంగా వదిలేయకుండా వాటిని కూడా అందజేయాలని జాబితాలో ఎంపికైన లబ్ధిదారులు కోరుతున్నారు.

వెంటనే కేటాయించాలి



కలెక్టరేట్ వద్ద నిర్వహించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లక్కీ డ్రాలో నా పేరు వచ్చింది. అధికారులు సర్వే చేసి మాకు ఇల్లు మంజూరు చేస్తున్నట్లు ధ్రువపత్రం అందజేశారు. కానీ ఇప్పటివరకు ఇల్లు మాత్రం కేటాయించలేదు. గత ప్రభుత్వం చేపట్టిన పలు రకాల పథకాలను కొత్తగా వచ్చిన ప్రభుత్వం రద్దు చేస్తోంది. దీంతో మాకు గతంలో ప్రకటించిన విధంగా ఇల్లు ఇస్తారా లేదా అని ఆందోళన కలిగిస్తోంది.

– షమీమ్, భువనగిరి

కొన్ని పనులు చేయాల్సి ఉంది

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కొన్ని పనులు చేపట్టాల్సి ఉంది. మౌలిక వసతుల కల్పన చేసిన తరువాత అప్పగించాలని గతంలో నిర్ణయించాం. రోడ్డు, విద్యుత్, డ్రెయినేజీ తదితర వసతులు కల్పించిన తరువాత అప్పగిస్తాం. ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా పనులు చేపడతాం.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

క్లుప్తంగా

'గుట్ట' ఆర్టీసీ డిపోలో వన భోజనాలు



ఉద్యోగికి బహుమతి అందజేస్తున్న ఆర్‌ఎం. శ్రీదేవి

యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆదేశాలతో యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో మంగళవారం నల్లగొండ రీజినల్ మేనేజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో వన భోజనాలు చేశారు. అనంతరం ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఉద్యోగులకు ఆర్.ఎం శ్రీదేవి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎం బి.శ్రీనివాస్, గ్యారేజీ ఇన్‌చార్జ్ హనుమాన్ నాయక్, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ హుస్సేన్, సూపర్‌వైజర్లు, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

చౌటుప్పల్ : ఉరేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన బూడిదపాటి ప్రవీణ్‌కుమార్(24) తల్లిదండ్రులతో కలిసి చౌటుప్పల్‌లోని మల్లికార్జున స్కూల్ దగ్గరలోని ఓ ఇంట్లో అద్దెకు నివసిస్తున్నాడు. ప్రవీణ్ లింగోజిగూడెం గ్రామంలోని ఓ పరిశ్రమలో హెల్పర్‌గా ఇతడి తల్లిదండ్రులు పట్టణంలోని ఓ పరిశ్రమలో కూలీలుగా పనిచేస్తున్నారు. రోజువారీగా తల్లిదండ్రులు మంగళవారం కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం వారు ఇంటికి రాగా డోర్ తెరిచి ఉంది. లోనికి వెళ్లి చూడగా ప్రవీణ్‌కుమార్ ఉరేసుకుని వేలాడుతూ ఉన్నాడు. వారు వెంటనే స్థానికులతో కలిసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించగా అప్పటికే ప్రవీణ్‌కుమార్ మృతిచెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

బీబీనగర్: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని పాత ఆల్వాల్‌లోని చంద్రాపూర్ కాలనీకి చెందిన గంద్ర సుమంత్(40) సోమవారం పని నిమిత్తం భువనగిరికి స్కూటీపై వచ్చాడు. పని ముగిసిన తర్వాత రాత్రి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో బీబీనగర్ మండల కేంద్రంలోని మాధవరెడ్డి చౌరస్తా వద్ద వెనుక నుంచి వస్తున్న వరంగల్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు అదుపు తప్పి స్కూటీని ఢీకొట్టింది. ప్రమాదంలో సుమంత్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సుగుణాకర్ రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగేంధర్ తెలిపారు.

అచేతనంగా చేనేత సంఘాలు

- ఆరేళ్లుగా పర్సన్ ఇంచార్జ్‌లకే బాధ్యత
- పాలకవర్గాలు లేక కూనారిల్లుతున్న చేనేత సహకార సంఘాలు

భూదాన్‌పోచంపల్లి : చేనేత సహకార సంఘాలకు గడువు ముగిసి ఆరేళ్ల సమీపిస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవడంతో కూనారిల్లుతున్నాయి. పాలకవర్గాలు లేని కారణంగా చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించలేకపోతున్నారు. ఫలితంగా చేనేత సహకార సంఘాలు అచేతనంగా మారాయి. వాస్తవానికి ప్రతి ఏళ్ల కొకసారి ఎన్నికలు నిర్వహించాలి. జిల్లా వ్యాప్తంగా చివరగా 2013 ఫిబ్రవరిలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. 2018 ఫిబ్రవరిలో పాలకవర్గాలకు ఐదేళ్ల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇంచార్జ్‌లను నియమించి, వారితోనే పాలన నెట్టుకొస్తున్నారు. అయితే చేనేతసహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ఇటీవల చేనేత నాయకులు రాష్ట్ర చేనేత,జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి విన్నవించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైన చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందా లేదా అని చేనేత వర్గాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఇబ్బందుల్లో సంఘాలు

ఎన్నికలు నిర్వహించకుండా పాత పాలకవర్గాలు, అధికారులతో పర్సన్ ఇంచార్జ్‌లను నియమించడం వల్ల చేనేత సహకార సంఘాలు కార్మికులకు చేతినిండా పని కల్పించలేకపోతున్నాయి. పోచంపల్లి చేనేత సహకార సంఘంలో 920 మంది చేనేత కార్మికులకు సభ్యత్వం కల్గి ఉండగా వారిలో 450 మంది వరకు క్రియాశీలంగా మగ్గాలు నేసేవారు. కాని సంఘాలకు ఎన్నికలు లేక, మరోవైపు కార్మికులకు చేతినిండా పని కల్పించలేకపోతుండటంతో వారి సంఖ్య నేడు 150కు తగ్గింది. ముఖ్యంగా కార్మికులకు కావల్సిన నూలు, రంగులు, రసాయనాలు తదితర



పోచంపల్లి చేనేత సహకార సంఘం

ముడిసరుకు సకాలంలో అందించలేకపోతున్నారు. దాంతో చేనేత కార్మికులు మాస్టర్ వీవర్స్ వద్ద కూలీ మగ్గాలపై పనిచేస్తున్నారు. పాలక వర్గాలు ఉన్నపుడు పోచంపల్లి చేనేత సహకార సంఘానికి ఏడాదికి రూ. 3కోట్ల టర్నోవర్ అయ్యేంది. నేడు రూ.1.70 కోట్ల నుంచి రూ.2 కోట్లకు పడిపోయింది. ప్రస్తుతం నెలకు నెలకు రూ.10 లక్షల నుంచి 15లక్షల వరకు అమ్మకాలు గణనీయంగా పడిపోయాయని సంఘం బాధ్యులు పేర్కొంటున్నారు. పోచంపల్లి, చౌటుప్పల్, కొయ్యలగూడెం, భువనగిరి తదితర సంఘాలకు ఏడాదికి 2కోట్లపైగా వస్త్రాలను తయారు చేయించే సామర్థ్యం ఉంది. కానీ టెస్కో రూ. 50 లక్షల విలువైన వస్త్రాలను కూడా కొనడంలేదు. సంఘాలు బహిరంగ మార్కెట్‌లో వస్త్రోత్పత్తులను విక్రయించలేకపోతున్నారు. దాంతో ప్రస్తుతం ఒక్క చేనేత సహకార సంఘంలోనే కోటి 90లక్షల విలువైన చేనేత వస్త్రాల స్టాక్ పేరుకుపోయింది.

10 దఫాలుగా గడువు పొడిగిస్తూ...

2018లో గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు జరుగుతాయని గత పాలకవర్గం, అప్పటి అధికారులు ఎన్నికల నిర్వహణకు సంఘంలో సభ్యత్వం కల్గిన వారందరి ఫొటోలతో కూడిన ఓటరు జాబితాను సిద్ధం చేశారు. కానీ ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకుండా పాత పాలక వర్గాలకు ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించింది. ప్రతి 6 నెలల కొకసారి గడువు పొడిగించుకొంటూ ఈ ఆరేళ్ల కాలంలో 10 దఫాలుగా గడువు పొడిగించింది. ఆగస్టు వరకు



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

ఇచ్చిన గడువు ముగిసినా, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాకున్నా అధికారులు ఇప్పటి వరకు కొనసాగిస్తూ వస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సంఘాలు ఇలా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చేనేత సహకార సంఘాలు, పవర్‌లూమ్‌లు కలిపి మొత్తం 84 ఉన్నాయి. ఇందులో యాదాద్రి జిల్లాలోనే అత్యధికంగా 43 సంఘాలు ఉండగా 12 మాత్రమే క్రియాశీలంగా పనిచేస్తున్నాయి. వీటిలో మొత్తం 18,882 మంది చేనేత కార్మికులు సంఘ సభ్యులుగా ఉన్నారు. అలాగే నల్లగొండ జిల్లాలో 25 సహకార సంఘాలు, 5 పవర్‌లూమ్ సంఘాలు ఉండగా, ఇందులో మొత్తం 6,588 మంది కార్మికులు సభ్యులుగా ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 3 సహకార సంఘాలు పని చేస్తున్నాయి. 330 మంది సంఘ సభ్యులున్నారు.

పర్సన్ ఇంచార్జ్‌లకు బాధ్యత...

జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు పాత పాలకవర్గాలకే ఇంచార్జ్‌లను అప్పగించగా జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, సిరిపురం, తుమ్మలగూడెం, భోగారం, వెల్వర్తి సహకార సంఘాలకు మాత్రం నిధుల దుర్వినియోగం, అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో పీఏసీఎస్ చట్టం సెక్షన్ 51 కింద చేనేత జౌళిశాఖ అధికారులను పర్సన్ ఇంచార్జ్‌లను నియమించింది. అయితే అధికారులు ఇటు విధి నిర్వహణ మరోవైపు సంఘాలకు పర్సన్ ఇంచార్జ్‌గా రెండు బాధ్యతలు నిర్వర్తించడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ఉత్తర్వులు రాలేదు



చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం గత ఏడాది ఆగస్టు వరకు ఇచ్చిన గడువు ముగిసింది. తిరిగి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. దాంతో పర్సన్ ఇంచార్జ్‌లను కొనసాగిస్తున్నాం. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందా, లేదా గడువు పొడిగిస్తుందా అని ఇప్పటి వరకు స్పష్టతలేదు.

– విద్యాసాగర్, చేనేత జౌళిశాఖ ఏడీ, యాదాద్రి భువనగిరి జిల్లా

ఇబ్బందులు పడుతున్నాం



చేనేత సహకార సంఘం ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చేనేత కార్మికుడే సంఘానికి చైర్మన్‌గా ఉంటే మా సాధకబాధలు తెలిసి మాకేం అవసరమో సమకూరుస్తారు. మా సమస్యలను చెప్పుకోలేం. వెంటనే సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి.

– భారత భూషణ్, చేనేత సహకార సంఘ సభ్యుడు, భూదాన్‌పోచంపల్లి

ఎన్నికలు నిర్వహించాలి



గత ప్రభుత్వం దీర్ఘ కాలంగా ఎన్నికలు నిర్వహించకుండా సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ఈ వ్యవస్థను పటిష్ఠం చేయాలంటే తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి. త్వరలో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ద్వారా సంబంధిత మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసి సమస్యను విన్నవిస్తాం.

– అంకం పాండు, జిల్లా చేనేత నాయకుడు

భార్యకు గడ్డిమందు తాగించి హత్య

- ఆస్తి తగాదాలే కారణం
- మద్దిరాలలో దారుణం

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. ఓ వ్యక్తి మరికొందరి సహకారంతో భార్యకు బలవంతంగా గడ్డిమందు తాపగా ఆమె చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిరాల మండల కేంద్రానికి చెందిన కుంచం వెంకన్న, కళమ్మ (46) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు సంతానం. మండల కేంద్రంలో రెండు షటర్లను నిర్మించుకుని ఒకటి అద్దెకి ఇచ్చి మరో దాంట్లో వీరు నివసిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం అద్దెకిచ్చిన షటర్‌ను వెంకన్న మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించాడు. ఈ విషయంలో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ పత్రాలపై సంతకం చేయాలని వెంకన్న కొద్ది రోజులుగా భార్యపై ఒత్తిడి చేస్తున్నాడు. ఈ



కుంచం కళమ్మ మృతదేహం

నేపథ్యంలోనే సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెంకన్న రిజిస్ట్రేషన్ పత్రాలపై సంతకం కళమ్మను కోరాడు. దీనికి ఆమె ఒప్పుకోకపోవడంతో మరికొందరి సహకారంతో కళమ్మ బలవంతంగా గడ్డి మందు తాపించాడు. బాధితురాలు కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు ఇంటికి రావడంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. స్థానికులు ఆమెను సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. భర్త పురుగుల మందు తాపిన విషయం ఆస్పత్రిలో వంగ్మూలం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. వెంకన్నతో పాటు మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. కళమ్మ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బ్రహ్మమురారి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు



అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

చౌటుప్పల్ : స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. పట్టణ కేంద్రంలో రెండు రోజుల పాటు సాగనున్న జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. పలువురు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్రజాస్వామికమైన విధానాలను అవలంబించిన కారణంగానే గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయిందన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో సీపీఎం రాష్ట్రంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ తన ఎదుగుదలకు ప్రణాళికలు వేస్తున్న విషయాన్ని సీపీఎం పార్టీ ముందుగానే పసిగట్టి ఆపార్టీని నిలువరించేందుకు నడుంబిగించిందన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి వెంకట్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, నాయకులు కొండమడుగు నర్సింహ్మా, బట్టుపల్లి అనురాధ, దోనూరు నర్సిరెడ్డి, కల్లూరి మల్లేషం, మేక అశోక్‌రెడ్డి, మంగ నర్సింహులు, ఎండి.పాషా, గంగదేవి సైదులు, బండారు నర్సింహ్మా, తడక మోహన్, రాగీరు కిష్టయ్య, బొజ్జ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

మునగాల(కోదాడ): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. మునగాల, మిర్యాలగూడ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మునగాల మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఓ రైతుకు సంబంధించిన తోటలో మిర్చి ఏరేందుకు ట్రాక్టర్‌లో కలకోవ గ్రామానికి చెందిన 20మంది కూలీలు వెళ్లారు. పని ముగించుకొని తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయని తెలిసింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బైక్ అదుపుతప్పి..

మిర్యాలగూడ టౌన్ : నిడమనూరు మండలం బొక్కమంతులపాడు గ్రామానికి చెందిన తల్లి, కొడుకు లింగమ్మ, వెంకన్నలు పని నిమిత్తం బైక్‌పై మిర్యాలగూడకు బయలుదేరారు. మార్గమధ్యలో మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ వద్ద వీరి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న తల్లి, కొడుకుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కోదాడఅర్బన్ : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్, అడిషనల్ జూనియర్ జడ్జి భవ్య విద్యార్థులకు సూచించారు. కోదాడ పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎం పాఠశాలకు చెందిన విద్యార్థులు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం కోదాడ కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి జడ్జిలు మాట్లాడారు.



చట్టాల గురించి వివరిస్తున్న జడ్జీలు శ్యాంసుందర్, భవ్య

సివిల్ కేసులు, క్రిమినల్ కేసులతో పాటు చట్టాలపై విద్యార్థులకు వారు వివరించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

వేములపల్లి : షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు, నగదు దగ్ధమయ్యాయి. వేములపల్లి మండల పరిధిలోని బుగ్గబావిగ్రామానికి చెందిన మడుపు సైదులు కోటేశ్వరీ దంపతులు ఇంట్లో పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఫ్రిడ్జ్, టీవీ, కూలర్, కుక్కర్‌తోపాటు బియ్యం, ఇంట్లో దాచుకున్న రూ.15వేల నగదు కాలిపోయాయని బాధితులు వాపోయారు. తమకు ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

జూదరుల అరెస్ట్

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని కొమరబండలో పేకాట ఆడుతున్న ఐదుగురు యువకులను రూరల్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. గ్రామ శివారులో కొందరు యువకులు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.500 నగదు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విజయవంతం చేయాలి

నల్లగొండ రూరల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని డీఈఓ భిక్షపతి కోరారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు చెకుముకి సామర్థ్య పరీక్షకు హాజరై సైన్స్ పరిజ్ఞానాన్ని పరీక్షించుకుని ఉత్ప్రేరణ పొందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 19న పాఠశాల స్థాయి, 27న మండల స్థాయి, ఫిబ్రవరి 3న జిల్లా స్థాయి, ఫిబ్రవరి 9 నుంచి 11 వరకు రాష్ట్ర స్థాయి సంబరాలు నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

నేడు వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

చిట్యాల : మండలంలోని వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షంపై ఆ సొసైటీ డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై బుధవారం ఆ పీఏసీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. చైర్మన్ రుద్రారపు భిక్షం అధికార దుర్వినియోగం చేస్తున్నారని సొసైటీకి చెందిన వైస్ చైర్మన్, ఆరుగురు డైరెక్టర్లు గత నెల 15వ తేదీన అవిశ్వాస తీర్మాన పత్రాన్ని సహకార శాఖ జిల్లా అధికారులకు అందజేశారు. అధికారులు గత నెల 19వ తేదీన సంబంధిత చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లకు అవిశ్వాస తీర్మానంపై సమాచారం అందించారు.

ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ

- అధికారుల తీరుపై నల్లగొండ జెడ్పీటీసీల అసంతృప్తి

నల్లగొండ : జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వాడీవేడి చర్చసాగింది. జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో జరిగాయి. ఆర్థిక, పనులు, గ్రామీణాభివృద్ధి, విద్యా, వైద్యం స్థాయీ సంఘాలకు నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా, వ్యవసాయ స్థాయీ సంఘానికి జెడ్పీవైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మహిళా శిశు సంక్షేమ స్థాయీ సంఘానికి కంకణాల ప్రవీణ అధ్యక్షతన వహించారు. ఆయా సమావేశాల్లో పలువురు జెడ్పీటీసీలు మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నాంపల్లి జెడ్పీటీసీ మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ల విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నాంపల్లి మండలంలో రోడ్డు పనుల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించడం లేదని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ప్యాకేజీ పద్ధతిలో పనులు ఇవ్వడం వల్లే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఈఈ మాట్లాడుతూ ఆ పనులను వెంటనే పర్యవేక్షించి నాణ్యత



మాట్లాడుతున్న నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

లేకపోతే కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిప్పర్తి జెడ్పీటీసీ రాంరెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు విషయంలో ఆలస్యం జరుగుతోందని అవసరమైన చోట్ల వెంటనే ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే విషయంలో ఒరిజినల్ ఆధార్ కార్డు కాకుండా జిరాక్స్ ప్రతిని అనుమతించాలని, ఆర్టీసీ ప్రత్యేక కార్డు ఇవ్వాలని అధికారులకు సూచించారు. పురుషులకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలన్నారు. దీనిపై డీఎస్‌ఓ స్పందిస్తూ అర్హులైన వారందరికీ కార్డులు అందుతాయని తెలిపారు. సమావేశాల్లో డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

మిర్యాలగూడ : ఫర్టిలైజర్ షాపుల యాజమాన్యం రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఏడీఏ పోరెడ్డి నాగమణి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ యాప్‌లో భాగంగా రికార్డులను పరిశీలించి నివేదికను ఆన్‌లైన్‌లో సమర్పిస్తున్నట్లు తెలిపారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ఏరోజుకారోజు స్టాక్ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ-పాస్ ద్వారానే ఎరువులు, యూరియా విక్రయించాలన్నారు. ప్రస్తుతం వాతావరణంలో చలి ఎక్కువగా ఉండడం వల్ల వరి చేలకు అగ్గి తెగులు సోకుతున్నాయని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుని తెగుళ్లను నివారించుకోవాలన్నారు. ప్రస్తుతం 20వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ నాగమణి

చెంచులు ఆర్థికంగా ఎదగాలి

డిండి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను చెంచులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని డీటీడీఓ (డిస్ట్రిక్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) రాజ్‌కుమార్ పేర్కొన్నారు. చెంచుల ఆర్థిక, సామాజిక స్థితిగతులను తెలుసుకోవడానికి మంగళవారం ఆయన డిండి మండల పరిధిలోని గోనబోయనపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెంచులకు పక్కా ఇల్లు, తాగునీరు, మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్యనందించి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమం ప్రవేశ పెట్టిందని తెలిపారు. అనంతరం చెంచులకు ప్రత్యేకంగా ఆధార్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.తిర్పతయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ డ్యానియల్, ఆర్‌ఐ శ్యామ్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నిధుల లేమి.. నిర్వహణ భారం

- వెలవెలబోతున్న రైతు వేదికలు
- ఏడాది కాలంగా విడుదలకాని నిర్వహణ నిధులు
- ఇబ్బంది పడుతున్న ఏఈఓలు

నల్లగొండ అగ్రికల్చర్ : వ్యవసాయ సీజన్‌లో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి ఏర్పాటు చేసిన రైతు వేదికలు నేడు అధ్వానంగా మారాయి. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా గత ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికలు నేడు ప్రయోజనం లేకుండా పోయాయి. ఏడాది కాలంగా వాటి నిర్వహణ కోసం ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడం వల్ల నిర్వహణ భారంగా మారింది. వ్యవసాయ క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారుల పర్యవేక్షణలో పని చేయాల్సిన రైతు వేదికలు నేడు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లా స్థాయిలో అధికారులు వాటిని పర్యవేక్షణ చేయని కారణంగా నేడు రైతు వేదికలు వెలవెలబోతున్నాయి.

గత ప్రభుత్వంలో నిర్మాణం..

రైతుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. జిల్లా వ్యాప్తంగా 140 వ్యవసాయ క్లస్టర్లకు గాను 140 రైతు వేదికలను ఏర్పాటు చేసింది. ఒక్కో రైతు వేదికకు రూ.22 లక్షల చొప్పున వెచ్చించి నిర్మాణాలు పూర్తి చేసింది. అవసరమైన వసతులు కల్పించడంతో పాటు కుర్చీలు, మైక్‌సెట్, విద్యుత్ సౌకర్యాలు కల్పించింది. వాటి నిర్వహణ కోసం ప్రతి నెల రూ.9 వేలు వెచ్చిస్తామని చెప్పింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏఈఓల ఖాతాల్లో తొలుత ఐదు నెలల పాటు నిర్వహణ నిధులు కూడా జమ చేసింది. కానీ, ప్రస్తుతం ఏడాది నుంచి నిర్వహణ నిధులు విడుదల చేయలేదు. దీంతో ఏఈఓలు వాటి నిర్వహణ భారాన్ని భరించలేక ఇబ్బంది పడుతున్నారు.



పానగల్ రైతు వేదిక

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

రైతు వేదికలను గ్రామాలుక చివరన ఉండడంతో ప్రస్తుతం వాటిని పట్టించుకునే నాథుడు లేకుండా పోయారు. దీంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రైతువేదికలపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో వ్యవసాయ విస్తరణ అధికారులు వాటిని నిర్వహించలేమని చేతులెత్తేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతు వేదికలను పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



రైతు వేదికల నిర్వహణకు కొన్ని నెలలుగా నిధులు రాక వ్యవసాయ విస్తరణ అధికారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల చేయగానే వ్యవసాయ విస్తరణ అధికారుల ఖాతాల్లో జమ చేస్తాం.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ